క్లుప్తంగా

11 వరకు కుష్టు వ్యాధి సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పోతునూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి సర్వే ఈ నెల 11 తేది వరకు చేస్తారని వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పోతునూరులో వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఎంపీహెచ్ ఈవో హరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి లక్షణాలు పరిశీలించి పరీక్షలు చేస్తున్నారు. ఇళ్లకు వచ్చిన వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ వివరాలు చెప్పి సహకరించాలని వైద్యాధికారి కోరారు.

భీమ నాగ లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

దెందులూరు: గాలాయగూడెం భీమ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి ఆలయ అర్చకులు నిమ్మ కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించి పూజలు, ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తాగునీటి చెరువులో వ్యర్థాల తొలగింపు



చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు

దెందులూరు: మండలంలోని దోసపాడు గ్రామ త్రాగునీటి చెరువులో శుక్రవారం తామరనాచు వ్యర్థాలను తొలగించారు. వేసవి కాలంలో గ్రామస్తులకు సురక్షితమైన తాగు నీరు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను చేపట్టారు.

విజిలెన్స్ తనిఖీలు



ఎంఎంపురంలో దుకాణంపై దాడి చేసిన విజిలెన్స్ ఎస్సై రంజిత్, తహసీల్దార్ కన్యాకుమారి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురం గ్రామంలోని రేషన్ షాపుపై శుక్రవారం విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్, తహసీల్దార్ కన్యాకుమారి ఆధ్వర్యంలో రేషన్ దుకాణంలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. బియ్యం, పంచదార స్టాకులను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆన్‌లైన్, నిల్వ స్టాకుకు తేడా ఉన్నట్లు గుర్తించారు. 708 కేజీల బియ్యం తక్కువగాను, 72 కేజీల పంచదార ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దుకాణం డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. సరుకులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ జి.భరత్‌కుమార్, వీఆర్వో సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు



దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో నిర్వహిస్తున్న అచ్చమ్మ పేరంటాల ఆలయ 68వ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ పాటలకు డ్యాన్సర్లు ప్రదర్శించిన నృత్యాలను జనం ఆసక్తిగా తిలకించారు. ఢీ షో, నెల్లూరు ఈవెంట్స్ డ్యాన్సర్లు ఈ నృత్యాలను ప్రదర్శించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెదవేగి: మండలంలోని బాపిరాజుగూడెంలో షిరిడి సాయినాథుని 11వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం ఐదు గంటలకు ఆవాహిత దేవతా పూజలు, సాయినాథునికి పంచామృతం, 108 కలశాలతో కూడిన పలు నదీ జలాలు, 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ చేసి, శ్రీవల్లీ దేవసేవ సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంతో పాటు గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం సాయినాథుని గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పటిష్ట ప్రణాళికతో ‘పది’ ప్రీ పబ్లిక్

- ఈ నెల 10 నుంచి 20 వరకూ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు
- పరీక్ష గంట ముందు మాత్రమే స్కూళ్లకు ప్రశ్నా పత్రాలు



పత్తేపురం జెడ్పీ స్కూల్‌లో మోడల్ టెస్ట్‌లు రాస్తున్న విద్యార్థులు

నిడమర్రు: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకం, వారి బంగారు భవితకు పునాది. అలాంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ముందుగా నిర్వహించే ప్రీ పబ్లిక్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 27 నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ముందు ఈ ప్రీ ఫైనల్ ట్రిల్ లాంటిదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పబ్లిక్ పరీక్షలు కూడా ఈ తరహాలో ఉంటాయని విద్యార్థులు తప్పనిసరిగా ప్రీ ఫైనల్‌కు హాజరవ్వాలన్నారు. టెన్త్‌లో మంచి ఫలితాలు రాబట్టేందుకు ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో నిపుణులైన టీచర్లతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు మారిన పరీక్షా విధానంపై జిల్లా విద్యాశాఖ అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే అన్ని స్కూళ్లలో మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు ఇలా

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 20 వరకు నిరిహించనున్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది. భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక పేపర్‌గా 50 మార్కులకు, మరో 50 మార్కులకు జీవశాస్త్రం పేపర్ ఉంటుంది. ఈ రెండు పరీక్షలు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 10న ఫస్ట్ లాగ్వేజ్ (తెలుగు/ఉర్దూ), 11న సెకండ్ లాగ్వేజ్ (హిందీ), 12న థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లీషు, 15న గణితం, 17న భౌతిక రసాయన శాస్త్రాలు, 18న జీవశాస్త్రం, 20న సోషల్ పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్ష 30 నిమిషాలు కుదించడపై అభ్యంతరం

అయితే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థి 100 మార్కుల పరీక్ష రాసేందుకు 3.15 గంటల సమయం కేటాయించారు. కానీ ప్రీ ఫైనల్ పరీక్షల్లో 100 మార్కుల పరీక్ష రాసేందుకు విద్యార్థికి ఇచ్చిన సమయం 2.45 గంటలు. ప్రీ పబ్లిక్ పరీక్షకు 30 నిమిషాలు కుదించారని దీనిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష తర్వాత స్టడీ అవర్‌కు కూర్చోబెట్టడం ఇబ్బందే దానికి బదులు మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 గంటల వరకూ పరీక్ష నిర్వహించి అనంతరం విద్యార్థులను విడిచి పెడితే మంచిదని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈవో కార్యాలయాల వద్దే ప్రశ్నా పత్రాలు

మండల విద్యాశాఖ కార్యాలయాల వద్దనే ప్రీ పబ్లిక్ ప్రశ్నా పత్రాలు భద్రపరిచేలా జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంఈవోలను బాధ్యులను చేస్తూ వారిని కస్టోడియన్లుగా నియమించారు. గతంలో మాదిరిగా ఆయా జెడ్పీ పాఠశాలల్లో హెచ్ఎంలు బాధ్యులుగా ప్రీ ఫైనల్ ప్రశ్నా పత్రాలు ఉంచరాదని అధికారులు పేర్కొంటున్నారు. పరీక్ష రోజు గంట ముందు మాత్రమే ప్రశ్నా పత్రాలను ఆయా స్కూళ్లకు తీసుకెళ్లాలని అధికారులు తెలిపారు.



అర్ధవరం జెడ్పీ స్కూల్‌లో ప్రీ పబ్లిక్ నిర్వహణపై సూచనలు చేస్తున్న ఎంఈవోలు రాజేష్, బాలయ్య



అర్ధవరం జెడ్పీ స్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పరీక్షా విధానంపై అవగాహన కల్పిస్తున్న మండల టీం

ప్రీ ఫైనల్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



ఈ నెల 10వ తేదీ నుంచి టెన్త్ విద్యార్థులకు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వంతో పాటు, ప్రైవేట్ టెన్త్ విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఆయా పరీక్ష రోజుల్లో సంబంధిత ప్రశ్నా పత్రాలను ఒక గంట ముందు మాత్రమే ఆయా స్కూల్ బాధ్యులకు ఎంఈవో కార్యాలయం నుంచి పంపిణీ చేస్తాం.

– ఎస్.రాజేష్, ఎంఈవో–1, గణపవరం

విద్యార్థి బలాలు, బలహీనతలు తెలుస్తాయి



ప్రీ పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన మార్కులతో విద్యార్థి బలాలు, బలహీనతలు తెలుసుకుని వెనుకబడిన సబ్జెక్ట్‌లపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుంది. పబ్లిక్ తరహాలోనే ఈ పరీక్షలు నిర్వహణతో వచ్చే పబ్లిక్ పరీక్షలపై భయం అపోహలు తొలుగుతాయి. ఇప్పటికే అధికారులు మారిన పరీక్షా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

– కె.సుబ్బరాజు, ఎస్ఏ, పత్తేపురం జెడ్పీ స్కూల్

గుండె నొప్పి రోగికి మొదటి గంట కీలకం



కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: ఛాతీ నొప్పి వచ్చిన రోగికి మొదటి గంట కీలకమని, ఆ లోపు ఆసుపత్రికి తీసుకొస్తే ఆతడి గుండెకు భరోసా కల్పించి ప్రాణాప్రాయ స్థితి నుంచి కాపాడొచ్చని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ జి.సునీత అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యుల బృందంతో కలిసి సూపరింటెండెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జి.సునీత మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని రోగులు ఎక్కువగా గుండెపోటుతో చనిపోతున్నారన్న నివేదికల ఆధారంగా ప్రజలకు గోల్డెన్ అవర్ ఆవశ్యకతను తెలియజేసి, మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించొచ్చన్నారు. రోగికి గుండె నొప్పి, ఎడమ భుజం నొప్పి, ఆయాసం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించగానే సమీపంలోని ఆసుపత్రికి గంట లోపే తీసుకొస్తే వెంటనే ప్రాథమిక పరీక్షలు చేసి గుండె వ్యాధి నిపుణుల సూచనల మేరకు ఆ వ్యక్తికి అవసరమైన రూ.45 వేల విలువ గల ఇంజెక్షన్ అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమడోలు: సూరప్పగూడెం ఫైవంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్ట్ బేతంపూడి రవికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఈ నెల ఆరో తేదీ గురువారం బేతంపూడి రవి మోటార్ బైక్‌పై ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వెళుతున్నాడు. అదే సమయంలో భీమడోలు నుంచి ఏలూరు వైపుగా బైక్‌పై రాంగ్‌రూట్‌లో వస్తున్న ఓ వ్యక్తి బేతంపూడి రవిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బేతంపూడి రవి కుడి భుజంపై గాయాలయ్యాయి. ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవోపేతంగా జాతర ప్రారంభం



భీమడోలులోని అమ్మవార్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: 12 ఏళ్లకో సారి నిర్వహించే మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల జాతర మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో గోదావరి కాల్వ గట్టుపై ఉన్న పవిత్రమైన మన్నుతో మద్దిరామమ్మ విగ్రహాన్ని తయారు చేసి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాల నడుమ బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా సాగింది. గ్రామంలోని సంతమార్కెట్ వద్ద వేంచేసియున్న అమ్మవార్ల ఆలయాల వద్దకు భారీ భక్త జనంతో అమ్మవారి ప్రతిమను తీసుకుని వచ్చారు. ముగ్గురమ్మలకు పూరి మేడలను నిర్మించి అక్కడ ప్రతిష్ఠించారు. అనంతరం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, గన్ని వీరాంజనేయులు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వట్టి పవన్, కరణం పెద్దిరాజు, రావిపాటి సత్యశ్రీనివాస్, ప్రత్తి మదన్, ఆల్తి శ్రీనివాస్, తుమ్మగుంట రంగ, చింతా రాము, పసుపులేటి సత్యనారాయణ, తాటిమళ్ల రామ్మూర్తి, నారా శేషు, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. కల్యాణ వేదిక వద్ద ఉత్సవమూర్తికి అభిషేకాలు, మూలవిరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, చతుర్వేదస్వస్తి, నిర్వహించారు.

10న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

దెందులూరు: పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 54 సెంటర్లలో ఈ నెల 10వ తేదీన వైద్యశాఖ ఆధ్వర్యంలో నులి పురుగు నివారణకు మాత్రలు పంపిణీ చేస్తామని పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. 54 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 3200 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది మాత్రలను పంపిణీ చేశారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుని తమ చిన్నారులు విధిగా ఈ మాత్రలు వేసుకునేలా చూసుకోవాలన్నారు.

దళితుల శ్మశాన భూమికి రక్షణ కల్పించాలి



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నేతలు

పెదవేగి: ముండూరు దళితవాడ శ్మశాన భూమికి రక్షణ కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ముండూరు గ్రామంలో అక్రమణకు గురైన దళితుల శ్మశాన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులు కొన్ని సంవత్సరాల నుంచి చనిపోయిన వారిని ఖననం చేసుకునే శ్మశాన భూములను అన్యాక్రాంతం చేసి భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్నారని దుయ్యబట్టారు. పేదలకు, దళితులకు చెందిన శ్మశాన భూముల రక్షణ కోసం 2005లోనే అప్పటి ప్రభుత్వం జీవో 1235 తీసుకొచ్చి దళితుల శ్మశాన భూమికి రక్షణ కల్పించిందన్నారు. ఈ జీవోను అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దళితుల శ్మశాన భూమి ఆక్రమణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముండూరు గ్రామంలో దళితుల శ్మశాన భూమిని వెంటనే సర్వే చేయాలని కోరారు. కార్యక్రమంలో బట్టు మోషే, కొరపాటి విజయ్, గడ్డం గంగరాజు, జాలాది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వ్యవసాయం

- పురుగుమందు పిచికారీకి ఆధునిక సాంకేతికత
- రైతులకు సమయం, ఖర్చు ఆదా



పొలాల్లో డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

దెందులూరు: వరి పొలాల్లో పురుగుమందు పిచికారీకి గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం సేంద్రియ వ్యవసాయ పథకం అమల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రధాన పంటలు అంతర పంటలు సైతం వేసి రైతులు లాభాలు గడిస్తున్నారు. కూలీలతో చేయించుకోవడం కంటే డ్రోన్లతో పిచ్చికారీ చేయించేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. సమయం, నీరు ఆదా కావడం తద్వారా ఖర్చు తగ్గడం డ్రోన్ల వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక ఎకరాకు ఆరు నుంచి పది నిమిషాల లోపు డ్రోన్‌తో స్ప్రే పూర్తవుతుంది. ఇందుకుగాను డ్రోన్ నిర్వహణకు రూ.450 చెల్లించాల్సి ఉంది. అదే కూలీలకు అయితే ఒక ఎకరాకు రూ.550–600 ఇవ్వాలి. కేవలం పది లీటర్ల నీటితో ఒక ఎకరం స్ప్రే చేసి నీటి ఎద్దడి ఉన్న పొలాలకు డ్రోన్లతో స్ప్రే విధానం రైతులకు వరంగా మారింది. కెమికల్ మాత్రం నిర్ణయించిన మోతాదును వాడాల్సి ఉంటుంది. డ్రోన్లు బ్యాటరీ కెపాసిటీని బట్టి రూ.4 లక్షలు, రూ.6 లక్షలు, రూ.10 లక్షలు ఖరీదు ఉన్నాయి. పొలాలకు డ్రోన్లతో పిచికారీ చేయడానికి వ్యవసాయ శాఖ అనుమతిని ఇవ్వటంతో గ్రామీణ ప్రాంత రైతులు ఈ తరహా డ్రోన్లు వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఖర్చు ఆదా అవుతుంది



డ్రోన్‌తో పిచికారీ విధానం చాలా సులభంగా ఉంది. సమయం, నీరు, ఖర్చు ఆదా అవుతుంది. రైతులకు చాలా మేలు కలుగుతుంది. నేను డ్రోన్లతోనే పిచికారీ చేస్తున్నాను.

– ఆలూరి వెంకటేశ్వరరావు, రైతు, జోగన్నపాలెం

రైతులకు శిక్షణ ఇస్తున్నాం



మండలానికి ఒకరిని డ్రోన్‌తో స్ప్రే చేయడానికి శిక్షణ నిమిత్తం ఎంపిక చేశాం. వారికి వ్యవసాయ శాఖ శిక్షణ ఇస్తుంది. శిక్షణ ముగిసిన తర్వాత 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు చేస్తాం. అన్ని ప్రాంతాల్లో డ్రోన్లతో పిచికారీ చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– వై.సుబ్బారావు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయశాఖ

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



విద్యార్థులకు పోష్టికాహారాన్ని అందిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు అల్పాహారం అందించడం అభినందనీయమని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరైన 168 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల ఇంగ్లీషు టీచర్ జి.సుధారాణి ఆర్థిక సాయంతో పోష్టికాహారం గల ఉడకబెట్టిన పల్లీలను అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వాటిని విద్యార్థులకు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ఎం ఆహ్మద్ చేతుల మీదుగా వారికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్న ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అదనంగా ఒక గంట ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

గణపవరం: పని లేని రోజుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కేశవరం, అప్పనపేట, మల్లపురాజు పేట ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కార్మికులతో కలిసి కేశవరం సచివాలయం వద్దకు ప్రదర్శనగా వెళ్లి కార్యదర్శి నర్సమాంబకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి పెంటారావు, కేతా శ్రీనివాస్, పి.ధనలక్ష్మి, పి.నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలి స్ఫూర్తి ప్రదాత మృతి



దెందులూరు: కొవ్వలి స్ఫూర్తి ప్రదాత ఇంజనీరు వెలమాటి చంద్రశేఖర్ జనార్ధన్‌రావు (85) శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొవ్వలి ఉన్నత పాఠశాలకు రూ.3 కోట్ల 50 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశారు. కొవ్వలి ఉన్నత పాఠశాలకు జూనియర్ కళాశాల మంజూరైన నేపథ్యంలో కళాశాల నిర్మాణానికి స్థలాన్ని సైతం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జనార్ధన్‌రావు ఉన్నత పాఠశాలకు చేసిన అభివృద్ధి విద్య పట్ల ఆయనకున్న గొప్ప దాతృత్వ గుణానికి కొవ్వలి ఉన్నత పాఠశాలకు ఆయన పేరును ఏర్పాటు చేస్తూ జీవోను విడుదల చేసి ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి హెచ్ఎం నివాళులర్పించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందిస్తున్న దాత

గణపవరం: ఇక నుంచి ప్రతి ఏటా గణపవరం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తామని సరిపల్లె గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ రామ్‌లక్ష్మణ్ ఫౌండేషన్ చైర్మన్ విష్ణుభట్ల లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రతిభావంతులైన విద్యార్థులకు రామ్‌లక్ష్మణ్ ఫౌండేషన్ తరపున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. కాలేజీలో ప్రథమ బహుమతి రూ.40 వేల నగదును కె.రవికుమార్‌కు అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.20 వేలు కె.మహితకు, తృతీయ బహుమతి రూ.10 వేలు టి.భవానికి అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా పుట్టిన గ్రామాన్ని, చదివిన విద్యా సంస్థను మరువలేమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సూరపరాజు, సంకు శ్రీను, ఎన్.శ్రీరామ్, ఎ.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.